క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థినికి వైద్య పరీక్షలు చేస్తున్న డా.ఉషారాణి

పెద్దపప్పూరు: భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని పెద్దపప్పూరు పీహెచ్‌సీ వైద్యురాలు ఉషారాణి విద్యార్థులకు సూచించారు. సోమవారం పెద్దపప్పూరులోని బీసీ బాలుర వసతి గృహంతో పాటు జూటూరు కేజీబీవీ, బీసీ బాలికల వసతి గృహాలను ఆమె తనిఖీ చేశారు. అనంతరం చిన్నపాటి ఆరోగ్య సమస్యలున్న విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్య వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ శర్మావలి, ఆరోగ్య, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

యాడికి: మండల కేంద్రానికి చెందిన మంజునాథరెడ్డి (34) కనిపించడంలేదని ఆయన తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన మల్లికార్జునరెడ్డి కుమారుడు మంజునాథరెడ్డి ఈ నెల 26న రాత్రి 8 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అయితే ఇంటికి తిరిగిరాకపోవడంతో పలు చోట్ల వెతికినా కనిపించలేదు. సోమవారం మల్లికార్జునరెడ్డి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నూతన కమిటీల ఏర్పాటు

పెద్దపప్పూరు: తాడిపత్రి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీస్ నూతన గ్రామ కమిటీ అధ్యక్షులను నియమిస్తున్నట్లు ఎమ్మార్పీస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఆదినారాయణ తెలిపారు. సోమవారం మండలంలోని అమ్మలదిన్నె అంబేడ్కర్ కాలనీలో ఆయన కాలనీవాసులతో సమావేశం నిర్వహించి గ్రామ కమిటీ ఎంపిక చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కంబగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలుంటే అర్జీలు ఇవ్వండి

యల్లనూరు: మండలంలో ఏవైనా సమస్యలు ఉంటే అర్జీల రూపంలో ఇచ్చి పరిష్కరించుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్వేత తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఒక్క అర్జీ వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరరాజు, ఎంఈఓలు చంద్రశేఖర్, పరమేశ్వరరెడ్డి, పీఆర్ ఏఈ నరేంద్ర, ఏపీవో షబ్బీర్‌బాషా, ఏవో రామకృష్ణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజామణి, హౌసింగ్ ఏఈ సుప్రజ, లైన్‌మెన్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని కర్నూలు రోడ్డులో సోమవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బైక్ అదుపుతప్పిన ఘటనలో జడ్‌వీరారెడ్డి కాలనీకి చెందిన రామాంజి గాయపడ్డాడు. గమనించిన స్థానికులు అతడ్ని ఆసుపత్రికి తరలించారు.


పర్యావరణ పరిరక్షణతో మనుగడ



విద్యార్థులకు మొక్కలు అందజేసిన దృశ్యం

గుత్తి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి. పర్యావరణ పరిరక్షణతోనే జీవరాశుల మనుగడ సాధ్యమని కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ మల్కీసాబ్ అన్నారు. సోమవారం కేంద్రీయ విద్యాలయంలో శిక్షా సప్తాహ్ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు. విద్యార్థులకు ఒక్కొక్కరికి ఒక మొక్కను బహూకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. చెట్లు ఉంటేనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవిత కాలంలో కనీసం ఐదు మొక్కలైనా నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత



శింగనమల పోలీస్‌స్టేషన్‌కు ఇసుక టిప్పర్లను తీసుకొచ్చిన పోలీసులు

శింగనమల: మండలంలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను ఆదివారం రాత్రి కొరివిపల్లి వద్ద పట్టుకున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో , దాడి చేసినట్లు తెలిపారు. మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

శింగనమలకు దారెటు?



శింగనమలకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు

శింగనమల: జిల్లా కేంద్రం నుంచి విజయవాడకు నిర్మిస్తున్న 544డీ జాతీయ రహదారుల పనులతో శింగనమలకు ఎటు వెళ్లాలో తెలియక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అనంతపురం శివారులోని పాము రాయి వద్ద 44వ జాతీయ రహదారి నుంచి ముచ్చుకోట వరకూ పనులు సాగుతున్నాయి. అయితే శింగనమల సమీపంలోని మరువకొమ్మ వద్ద బ్రిడ్జి ఏర్పాటు చేయకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. శింగనమల నుంచి అనంతపురం, లేదా తాడిపత్రికి వెళ్లాలన్న ఇదొక్కటే మార్గం. బ్రిడ్జి ఏర్పాటు చేయకపోవడంతో శింగనమలలోకి రావాలంటే శివపురం పెద్దమ్మ గుడి వద్ద తాత్కాలికంగా వేసిన రహదారి మలుపు తిరిగి రావాల్సి ఉంటోంది. మరువకొమ్మ వద్ద బ్రిడ్జి ఏర్పాటు చేస్తే సమస్యకు పరిష్కారం దక్కుతుందని, ఆ దిశగా చర్యలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామంటూ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో చేపట్టిన స్పందన కార్యక్రమంలో స్థానికులు వినతి పత్రం అందజేశారు.

విద్యార్థులకు క్రీడలు ఎంతో అవసరం



స్పెయిన్ కోచ్‌లతో బీకేఎస్ జెడ్పీ హైస్కూల్ క్రీడా కారులు

బుక్కరాయసముద్రం: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరం అని బీకేఎస్ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు వసుంధర పేర్కొన్నారు. ఆర్డీటీ ఖలేయ స్పెయిన్ సౌజన్యంతో బాస్కెట్ బాల్ శిక్షణ శిబిరం ఈనెల 18 నుంచి 29 వరకు నిర్వహించగా, సోమవారం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణా శిబిరంలో 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారని పీడీ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు వసుంధర మాట్లాడుతూ క్రీడా పోటీలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. క్రీడా పోటీల్లో గ్రామీణ క్రీడాకారులే రాష్ట్ర, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. అనంతరం స్పెయిన్ కోచ్‌లు మెలకువలు తెలియజేశారు. స్పెయిన్ కోచ్, క్రీడాకారులకు సన్మానించారు. కార్యక్రమంలో స్పెయిన్ కోచ్‌లు టోని, కీకే, నాసికచచ ఆల్బేత్, పాఠశాల పీడీలు గోపాల్‌రెడ్డి, లలితమ్మ, రాజు, భాషా, భాస్కర్, సాయి, ఆరిఫ్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



అనుంపల్లిలో వాటర్ ట్యాంకు, మురుగు కాలువలను శుభ్రం చేయిస్తున్న అధికారులు

పామిడి: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఈఓఆర్డీ బీవీ శశికళ అన్నారు. సోమవారం మండలంలోని అనుంపల్లి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులతో వాటర్ ట్యాంకు, డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయించారు. అనంతరం ఈఓఆర్డీ మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా పరిశుభ్రత పాటించడం వల్ల సీజనల్ వ్యాధులు దరిచేరవన్నారు. వారానికి ఒకసారి డ్రై డే పాటించాలని తెలిపారు. దోమకాటు నివారణకు దోమతెరలు వాడాలన్నారు. ఆయా గ్రామాల్లో వాటర్ క్లోరినేషన్‌తో పాటు అపరిశుభ్రత నెలకొన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లను జేసీబీతో తొలగించారు. పబ్లిక్ ట్యాప్‌ల లీకేజీలకు మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ నారాయణ స్వామి, వైస్ ఎంపీపీ కాయల మహేష్, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు విద్యార్థులు



జగదీశ్వరరెడ్డిని తండ్రికి అప్పగిస్తున్న కానిస్టేబుల్

నార్పల: పాఠశాలకు వెళ్లేందుకు ఇష్టం లేక ఇంటి నుంచి పారిపోయిన వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు విద్యార్థుల ఆచూకీని ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి సకాలంలో గుర్తించి, వారిని సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. వివరాలు.. నార్పల మండలం దుగుమర్రి గ్రామానికి చెందిన గరుడశేఖర్‌రెడ్డి కుమారుడు జగదీశ్వర్‌రెడ్డి అనంతపురంలోని గ్లోబల్ సూక్‌లో ఆరో తరగతి, నార్పల నివాసి మధు కుమార్తె సాయికీర్తన... అనంతపురంలోని శ్రీచైతన్య పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ఆదివారం సెలవు కావడంతో ఇంటికి వచ్చిన వీరిద్దరూ సోమవారం పాఠశాలకు వెళ్లడం ఇష్టం లేక ఇంటి నుంచి పారిపోయారు. విషయం తెలుసుకున్నా తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు ఆయా గ్రామ పరిసరాల్లోనే విద్యార్థులను గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు.

విద్యార్థులతో సహపంక్తి భోజనాలు

యల్లనూరు: మండల కేంద్రంలోని కోటా పాఠశాల, హైస్కూల్లో ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ వీరరాజు, ఎంఈఓ -2 పరమేశ్వరరెడ్డి మధ్యాహ్న భోజనాన్ని సోమవారం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనంచేసి, నాణ్యతను పరిశీలించారు. దాత హైస్కూల్‌లో రికార్డు అసిస్టెంట్ వెంకటేష్ ఏర్పాటు చేసిన భోజనాన్ని విద్యార్థులకు పెట్టారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్వేత మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన, పౌష్టికాహారంతో కూడిన వంటలను వండిపెట్టాలన్నారు. రికార్డు అసిస్టెంట్ వెంకటేష్ ను సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకుపెట్టుబడి సాయం అందించాలి

గార్లదిన్నె: ప్రభుత్వం వెంటనే రైతులకు పెట్టు బడి సాయం రూ.20 వేలు అందజేయాలని రాయలసీమ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ముగుస్తున్న వర్షాలు కురవడం లేదని, ప్రభుత్వం ప్రత్యామ్నాయ విత్తనాలు ఉచితంగా అందజేయాలన్నారు. మిడ్ పెన్నార్ డ్యాం ఉత్తర, దక్షిణ కాలువలకు నీళ్లు వదలాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయ్ కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నారాయణరెడ్డి, మల్లన్న, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

గార్లదిన్నె: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌విజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజా సమస్యలు పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చిన అర్జీలను సంబంధించిన అధికారులకు అందజేసి, పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. భూ సంబంధిత అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటలక్ష్మి, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పన్నులు వసూలు చేయండి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు

గుత్తి: ఇంటి పన్ను, వాటర్ పన్ను, ట్రేడ్ లైసెన్స్‌లకు సంబంధించి 100 శాతం పన్నులు వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024–25 సంవత్సరానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల పన్నులను వసూలు చేయాలన్నారు. శానిటేషన్, వాటర్ సరఫరా, వీధి దీపాలు వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నెట్టికల్లు, సీనియర్ అసిస్టెంట్ రాజ్ గోపాల్, ఏఈలు రవి కుమార్, హరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పరిజ్ఞానం అవసరం



జ్ఞాపికతో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి

● కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి

బుక్కరాయసముద్రం: పంటల సాగులో ఆధునిక పరిజ్ఞానం ఎంతో అవసరం అని రైతులకు రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి సూచించారు. కేవీకే స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం రెడ్డిపల్లి కేవీకేలో నిర్వహించిన రైతుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా స్వర్ణోత్సవ జ్యోతి, మెమెంటోను ఆమెకు బనవాసి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్ర చౌదరి అందజేశారు. కార్యక్రమంలో కేవీకే సస్య ఉత్పత్తి శాస్త్రవేత్త డాక్టర్ శశికళ, ఎస్ఎంఎస్ వ్యవసాయ విస్తరణా శాస్త్రవేత్త డాక్టర్ చందన, సస్య రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి, పశు పోషణ శాస్త్రవేత్త డాక్టర్ మాధవి, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సుధారాణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ స్వాతి లక్ష్మి

బుక్కరాయసముద్రం: విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని డాక్టర్ స్వాతి లక్ష్మి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ వసతి గృహాన్ని పరిశీలించారు. మందుగా వసతి గృహంలో ఎంత మంది విద్యార్థులు, సిబ్బంది ఉన్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో తరగతి గదులు, వంటశాల, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వాతి లక్ష్మి మాట్లాడుతూ ఒత్తిడి తగ్గించుకునేందుకు రోజూ వ్యాయామం, యోగా చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైజన భోజనం వడ్డించాలన్నారు. వంట శాలల్లో చాలా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మోహన్, వార్డెన్ రామునాయక్, కేజీబీవీ ప్రిన్సిపాల్ నాగవేణి, పీహెచ్ఎస్ చెన్నమ్మ, సత్యనారాయణ శాస్త్రి, జయంతి, ధనుంజయ, ఆది నారాయణమ్మ, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు మార్గదర్శకుడు నకారా



నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పెన్షనర్లు

తాడిపత్రి అర్బన్: 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు సకాలంలో పెన్షన్‌ను పొందుతూ ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నారంటే అది ఒక్క డీఎస్ నకారా పోరాటం వల్లనే. ఆయన పెన్షనర్లకు మార్గదర్శకుడు' అని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక పెన్షనర్స్ భవన్‌లో డీఎస్ నకారా వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెన్షన్ సాధన కోసం నకారా చేసిన పోరాటాలను ఈ సందర్భంగా అందరూ గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలోఆదినారాయణస్వామి, వీరారెడ్డి, హనుమంతరెడ్డి, సుబ్రమణ్యం, రమణరాజు, కరుణాకర్, సూర్యనారాయణరెడ్డి, అశ్వర్థరెడ్డి,పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ధర్నా చేస్తున్న కార్మికులు

గుంతకల్లు: రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక డీఆర్ఎం కార్యాలయం వద్ద రైల్వే వర్కర్స్ యూనియన్, సీఐటీయూ సంయుక్తంగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్ర, నాయకులు మారుతి ప్రసాద్, కసాపురం రమేష్ మాట్లాడారు. రైల్వేలోని అన్ని డిపార్టుమెంట్లలో స్కిల్డ్, అన్ స్కిల్డ్ కేటగిరీల్లో వివిధ కాంట్రాక్టర్ల కింద పనులు చేస్తున్నారు. ఈ పనులన్నీ శాశ్వత స్వభావం కల్గినవే. అయితే శాశ్వత ఉద్యోగులకు దీటుగా రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నప్పటికి వీరి పరిస్థితి మాత్రం ఘోరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ కార్మిక చట్టాలను విస్మరించారని ఆరోపించారు. చాలా చోట్ల జీఓ రేటు కన్నా తక్కువ జీతాలు చెల్లిస్తున్నారని విమర్శించారు. దీనికి తోడు బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలతో మరింతగా కాంట్రాక్ట్ కార్మికుల జీవితాలను కష్టాల్లోకి నెడుతోందన్నారు. ఇటీవల రైల్వే బోర్డు విధి విధానాల ద్వారా కాంట్రాక్టర్స్, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించాలని ఆదేశాలతో రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తిమ్మప్ప, జాకీర్, ఓబులేసు, షాషా, రైల్వే వర్కర్స్ యూనియన్ నాయకులు మురళీ, అనిల్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: ఇటీవల బళ్లారిలో ఓ కళాశాలలో జరిగిన మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌లో గుంతకల్లుకు చెందిన శ్రీ శంకర నంద గిరి స్వామి డీగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ పి.గోపాల్ తెలిపారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 50 కళాశాలల ఇంజినీరింగ్, బీబీఏ, ఎంబీఏకి చెందిన దాదాపు 1000 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. బిజినెస్ క్విజ్, టీం బిల్డింగ్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్, మార్కెటింగ్, ఐస్ బ్రేకింగ్ తదితర విభాగాల్లో విద్యార్థులు సత్తా చాటారు. కళాశాలకు చెందిన బీబీఏ ఫైనల్ ఇయర్ విద్యార్థులు మేఘన, దివాకర్, హర్షద్, వినయ్‌కుమార్ ప్రతభ కనబరిచి ప్రథమ బహుమతి దక్కించుకున్నారు. అదేవిధంగా ద్వితీయ సంవత్సరం బీబీఏ, బీకాం కంప్యూటర్స్ విద్యార్థులు ఆరు రంగాల్లో తృతీయ స్థానాన్ని సాధించినట్లు వివరించారు. సోమవారం కళాశాలలో విద్యార్థులకు అభినంద సభ ఏర్పాటు చేసి ప్రత్యేకంగా అభినందిచారు. ప్రిన్సిపాల్ పి.గోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఆసక్తి ఉన్న రంగాలను ఎంచుకుని ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ శ్రావణి, డాక్టర్ సుభాషిని, ప్రజా సంబంధాల అధికారి బి.క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

తాడిపత్రి అర్బన్: కట్టుకున్న భార్యను అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్త, బావ, ఆడపడచులపై అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అర్బన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.... పట్టణంలోని నందలపాడుకు చెందిన మహ్మద్ షరీఫ్‌కు హాజున్నీతో కొద్ది సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. అయితే హాజున్నీ భర్త మహ్మద్ షరీఫ్, అత్త ఆరీఫా, బావ ఇస్మాయిల్, ఆడపడుచులు షాకీరా, ఫర్జానా అదనపు కట్నం కోసం వేధించే వారు. వారి వేధింపులు తాళలేక హాజున్నీ సోమవారం అర్బన్ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త, అత్త, బావ, ఆడపడుచులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

మట్టి రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు



ట్రాక్టర్లను అడ్డుకుంటున్న దృశ్యం

నార్పల: అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను నార్పల మండలం దుగుమర్రి వాసులు అడ్డుకున్నారు. ఎలాంటి అనుమతుల్లేకుండా సోమవారం ఉదయం దుగుమర్రి చెరువు నుంచి ట్రాక్టర్ యజమానులు మట్టిని అక్రమంగా తరలిస్తుండగా గ్రామస్తులు రోడ్డుకు రాళ్లు అడ్డంగా వేసి ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఇప్పటికై అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

గ్రీవెన్స్‌కు పలు వినతులు

పామిడి: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ సెల్) నిర్వహించారు. ఆన్‌లైన్‌లో భూ సమస్యలను పరిష్కరించాలంటూ పలు గ్రామాలకు రైతులు అర్జీలు ఇచ్చారు. అలాగే పట్టణంలోని బీసీసీ రోడ్డులో ఉన్న జాతీయ నాయకుల విగ్రహాలకు రంగులు వేయించాలని పట్టణ ప్రముఖులు అర్జీ అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ జి.లక్ష్మీనారాయణ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో..

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డు సచివాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ సెల్) నిర్వహించారు. సచివాలయాల అడ్మిన్లు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

గుత్తి రూరల్: సచివాలయ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం మండలంలోని అబ్బేదొడ్డి గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగుల హాజరు పట్టిక, ప్రజల ఫిర్యాదుల స్వీకరణపై సూచనలు ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత శాఖలకు పంపాలన్నారు. సచివాలయ పరిధిలోని గ్రామాల్లో విధిగా పర్యటించి సమస్యలను గుర్తించి తమ దృష్టికి తీసుకుని రావాలన్నారు. ప్రతి సచివాలయ ఉద్యోగి తప్పకుండా యూనిఫాం ధరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శివాజీరెడ్డి, కార్యదర్శి మసూద్ వలి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది అబ్దుల్ పాల్గొన్నారు.

పేకాట ఆడుతూ పట్టుబడితే చర్యలు

గార్లదిన్నె: పేకాట శిబిరాల్లో పేకాట ఆడుతూ తరచూ పట్టుబడితే, అలాంటి వారిపై చర్యలు తప్పవని ఎస్ఐ మహమ్మద్ గౌస్ హెచ్చరించారు. సోమవారం ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా పేకాట ఆడినట్లు తెలిస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో కొందరు ఇళ్లలోనే రహస్యంగా పేకాట ఆడుతున్నారన్నారు. ఆయా గ్రామాల్లో పేకాట స్థావరాలపై నిఘా ఉంచామన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మంగళవారం కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, చైర్‌పర్సన్ వన్నూర్‌బీ తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేద్దాం



భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ మస్తాన్‌రావు

గుంతకల్లు: ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాడానికి తల్లిదండ్రుల సహకరం అవసరమని ఎంఈఓ మస్తాన్‌రావు తెలిపారు. సోమవారం తిలక్‌నగర్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు పురపాలక ప్రాథమిక పాఠశాలలో శుభదిన్ భోజన్ కార్యక్రమం నిర్వహించారు. దాత వార్డు కౌన్సిలర్ గుడిపాటి ఆంజనేయులు విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆర్‌హెచ్ఎం కాశీనాథ్, క్లస్టర్ రీసోర్స్ పర్సన్ రఘుకుమార్, ఉపాధ్యాయులు సుకన్య, సరోజ, కమిటీ చైర్మన్ ఉమ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపురం ఉన్నత పాఠశాలలో..

గుంతకల్లు రూరల్: శిక్షా సప్తాహ్‌లో భాగంగా మండల పరిధిలోని తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు శుభదిన్ భోజన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన గోవిందప్ప అతడి మిత్రులు వెంకటేష్, బాలు, కేశవ, గంగాధర్, మురళి, అశోక్, రామాంజనేయులు తదితరులు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సమయంలో పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ రెడ్డి వారిని అభినందించారు.

పామిడి: మండలంలోని పి.కొండాపురం ప్రాథమిక స్కూల్‌లో సోమవారం శుభదిన్ భోజన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన రంగస్వామి యాదవ్ సహకారంతో విద్యార్థులకు పండ్లు, ఫలహారం అందజేశారు. ఈ సందర్భంగా దాత రంగస్వామికి ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.వెంకట రమణ, కృష్ణమూర్తి, తదితర ఉపాధ్యాయ, విద్యార్థులు పాల్గొన్నారు.